JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । శుక్రవారం 07-11-2025
Medchal - Malkajgiri । Friday 07-11-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 161 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 161 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





## గగన్ యాన్ కు రెడీ అవుతున్న భారత్

జయభేరి, బెంగళూరు, నవంబర్ 6:

భారత అంతరిక్ష చరిత్రలో అపూర్వ ఘట్టానికి నాంది పలకనున్నారు. ఆరు దశాబ్దాల భారత అంతరిక్ష పరిశోధనల్లో అత్యంత ముఖ్యమైన ఘట్టం మొదలు కాబోతోంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ISRO చేపట్టిన మానవ సహిత అంతరిక్ష మిషన్ గగనయాన్ ప్రాజెక్టులో తొలి అడుగు వచ్చే నెలలోనే పడబోతోంది..డిసెంబర్‌లో జరగనున్న మిషన్ ఈ దిశలో మొదటి ముఖ్యమైన అడుగు. ఈ ప్రయోగంలో వ్యోమిత్రఅనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హ్యూమనాయిడ్ రోబోను స్పేస్‌లోకి పంపనున్నారు.కొన్ని సంవత్సరాలుగా మన పరిశోధన సంస్థలు ఈ ఈ స్పేస్ రోబో ను రూపొందించాయి. ఈ మిషన్‌లో ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్ సిస్టమ్, అవియానిక్స్, సేఫ్టీ ప్రోటోకాల్‌లు, లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌లు వంటి భాగాలను అసలు అంతరిక్ష పరిస్థితుల్లో పరీక్షించనున్నారు. వ్యోమిత్ర స్పేస్ ఫ్లైట్ సేకరించే డేటా, భవిష్యత్తులో మానవ యాత్రల భద్రతా ప్రమాణాల కోసం కీలకంగా ఉపయోగపడుతుంది.గగనయాన్ మిషన్ భారత అంతరిక్ష చరిత్రలో కొత్త యుగాన్ని ప్రారంభించబోతోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన క్రూస్ మాడ్యూల్, సర్వీస్ మాడ్యూల్, ఎస్కేప్ సిస్టమ్ వంటి కీలక టెక్నాలజీలను పరీక్షిస్తోంది. దీని లక్ష్యం భారతీయ వ్యోమగాములను భవిష్యత్తులో భూమి చుట్టూ కక్ష్యలోకి పంపి, సురక్షితంగా తిరిగి తీసుకురావడం.వ్యోమిత్ర ఫ్లైట్ విజయవంతమైతే, భారత్ మానవ అంతరిక్ష యాత్రకు సాంకేతికంగా సిద్ధమవుతుంది. ఇది మన ISRO ధృఢ సంకల్పానికి ప్రతీక. స్వదేశీ రాకెట్ ఇంజినీరింగ్, స్పేస్ రోబోటిక్స్, లైఫ్ సపోర్ట్ టెక్నాలజీలు

...మిగతాది 2 లో

# కేటీఆర్‌ను అరెస్టు చేద్దామంటే..



బీఆర్ఎస్ నాయకుడు మాజీ మంత్రి కేటీఆర్‌ను అరెస్టు చేద్దామంటే గవర్నర్ అనుమతి ఇవ్వడంలేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

జయభేరి, హైదరాబాద్ :

బీఆర్ఎస్ నాయకుడు మాజీ మంత్రి కేటీఆర్‌ను అరెస్టు చేద్దామంటే గవర్నర్ అనుమతి ఇవ్వడంలేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా అవినీతి మయమైన కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ వేయాలని నిర్ణయం తీసుకుని..దీనిని సీబీఐకి కూడా అప్పగించామన్నారు. కానీ, మూడు మాసాలైనా ఇప్పటి వరకు సీబీఐ రంగంలోకి దిగలేదని తెలిపారు. ఈ పరిణామాలను చూస్తే బీఆర్ఎస్‌ను బీజేపీ కాపాడుతోందన్న విషయం స్పష్టంగా తెలుస్తోందని ఆరోపించారు. బీజేపీ, కారు పార్టీల మధ్య సమన్వయం సంబంధం లేకపోతే, ఇలా ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం అవుతుందని మరోసంచలన వ్యాఖ్య చేసిన సీఎం రేవంత్ రెడ్డి.ఈ విషయాన్ని గతంలో అదే పార్టీకి చెందిన కవిత కూడా చెప్పారన్నారు. విలీన ప్రక్రియ ప్రతిపాదనను తానే అడ్డుకున్నట్లు ఆమె చెప్పిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమయంలో ఇరు పార్టీలు కలిసి..ప్రయోగం చేస్తున్నాయని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా.. జూబ్లీహిల్స్‌లో గెలిచేది కాంగ్రెస్ పార్టీనేనని సీఎం చెప్పారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉంటున్నారని తెలిపారు. మైనారిటీలు, క్రిస్టియన్ వర్గాలు కూడా తమకే అనుకూలంగా ఉన్నారని రేవంత్ రెడ్డి చెప్పారు. భారత్ జోడో యాత్ర

...మిగతాది 2 లో



## కీలకంగా మారిన డేటా ఆధారిత పాలన

- జనవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్
- సీఎం చంద్రబాబు నాయుడు

జయభేరి, అమరావతి:

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో డేటా ఆధారిత పాలనపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు న మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఓడీలు...వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు హాజరయ్యారు. సీఎం డేటా ఆధారిత పాలనపై సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. చంద్రబబాబు మాట్లాడుతూ.. దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలి. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. దానికి అనుగుణంగానే విజన్ ప్రణాళికలను రూపొందించామని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రాధాన్యత కావాలి. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్గా

...మిగతాది 2 లో

## వచ్చే ఏడాది భారత్‌లో పర్యటిస్తా..



- ప్రధాని మోదీ నాకు మంచి మిత్రుడు.. ట్రంప్

జయభేరి, న్యూఢిల్లీ:

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై మరోసారి ప్రశంసల జల్లు కురిపించారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్. మోదీ చాలా గొప్ప వ్యక్తి అని, తనకు మంచి స్నేహితుడని చెప్పారు. వచ్చే ఏడాది భారత్ పర్యటకు వెళ్తానన్నారు. భారత్‌తో వాణిజ్య చర్చలు అద్భుతంగా సాగుతున్నాయన్న ట్రంప్.. ఇరు దేశాల చర్చలు త్వరలోనే కొలిక్కి వస్తాయన్నారు. గురువారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ప్రశంసించారు. ఆయనను గొప్ప వ్యక్తి, మంచి స్నేహితుడు అని అభివర్ణించారు. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసే ప్రయత్నాలలో భాగంగా వచ్చే ఏడాది భారతదేశాన్ని సందర్శించవచ్చని కూడా ఆయన సూచించారు. వైట్ హౌస్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ, ప్రధాని మోదీతో తన చర్చలు చాలా బాగా జరుగుతున్నాయని ట్రంప్ అన్నారు. భారతదేశం రష్యా నుండి కొనుగోలు చేయడం దాదాపుగా ఆపివేసిందని తెలిపారు. ఇదిలా వుంటే, భారీ సుంకాలు విధించాలనే వాషింగ్టన్ నిర్ణయం తర్వాత, ఈ ఏడాది చివర్లో జరగనున్న క్వాడ్ సమ్మిట్ కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇకపై భారతదేశాన్ని సందర్శించే ఉద్దేశం లేదని ఆగస్టులో ది న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. ట్రంప్ గతంలో తాను శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతానని ప్రధాని మోదీకి హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పుడు ఆయన తన ప్రణాళికలను మార్చుకున్నారని వెల్లడించింది.

...మిగతాది 2 లో



## అనుమతులేంటి... సభ నిర్వహించి తీరుతాం

జయభేరి, హైదరాబాద్, నవంబర్ 6:

జూబ్లిహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బోరబండలో సభ పెట్టాలనుకున్న బండి సంజయ్‌కు పోలీసులు షాక్ ఇచ్చారు. ఆయన సభకు అనుమతి రద్దు చేశారు. షెడ్యూల్ ప్రకారం ఈరోజు సాయంత్రం బోరబండలో మీటింగ్ జరగాల్సి ఉండగా, భద్రతా కారణాలు చెబుతూ పోలీసులు అనుమతిని వెనక్కి తీసుకున్నారు. ఈ నిర్ణయంపై బీజేపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. "అనుమతి ఇచ్చి తర్వాత రద్దు చేయడమేంటి?" అని వారు ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సాయంత్రం బోరబండలో మీటింగ్ జరిపి తీరుతామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. బోరబండ ప్రాంతంలో పోలీసులు భారీగా మోహరించారు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈసీ అనుమతి ఇచ్చినా పోలీసులు అనుమతి ఇవ్వకపోవడమేమిటని ఆయన ప్రశ్నించారు. "బోరబండకు నేనొస్తున్నా.. ఎవరు అడ్డుకుంటారో చూస్తా. ఇలాంటి అడ్డంకులు బీజేపీ ఎన్నోసార్లు ఎదుర్కొని పోరాడింది. మళ్లీ కూడా వెనక్కి తగ్గేది లేదు." అని బండి సంజయ్ ప్రకటించారు.

...మిగతాది 2 లో



## జాబ్ మేళాల ద్వారా 78వేలమందికి ఉద్యోగాలు

- ఇండస్ట్రీ కనెక్ట్ తో ఐటిఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు
- స్కిల్ డెవలప్ మెంట్ పై మంత్రి నారా లోకేష్ సమీక్ష

జయభేరి, అమరావతి:

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 406 జాబ్ మేళాల ద్వారా 78వేలమంది యువతకు ఉద్యోగాలు లభించినట్లు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఉండవల్లి నివాసంలో స్కిల్ డెవలప్ మెంట్ శాఖపై మంత్రి నారా లోకేష్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... జాబ్ మేళాల్లో మరిన్ని సంస్థలను భాగస్వాములను చేసి యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు

...మిగతాది 2 లో

## శిల్పాశెట్టి దంపతులకు బిగుస్తున్న ఉచ్చు..



- 60 కోట్ల ఛీటింగ్ కేసులో కీలక మలుపు

జయభేరి, ముంబై :

బాలీవుడ్ నటి శిల్పా శెట్టి ఈ మధ్యన పెద్దగా సినిమాలు చేయట్లేదు. కానీ ఈ ముద్దుగుమ్మ తరచూ ఏదో ఒక వివాదంలో ఇరుక్కుంటూనే ఉంది. శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రాపై రూ.60 కోట్ల మేర మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక వ్యాపారవేత్త వీరిపై కేసు నమోదు చేశాడు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో నడుస్తోంది. ఈ కేసు సాల్వ్ అయ్యేంతవరకు శిల్పాశెట్టి దంతపులు దేశం విడిచి వెళ్లకూడదని కోర్టు ఆదేశాలిచ్చింది. తాజాగా ఈ ఛీటింగ్ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఆర్థిక నేరాల విభాగం (EOW) శిల్పా కంపెనీలోని నలుగురు మాజీ ఉద్యోగులను విచారణ కోసం సమన్లు జారీ చేసింది. ఉద్యోగులలో ఒకరిపై కేసు నమోదు చేయగా, మిగిలిన ముగ్గురిపై ఇంకా

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## కేటీఆర్‌ను అరెస్టు చేద్దామంటే..

చేపట్టిన రాహుల్ గాంధీ మైనారిటీలకు అండగా ఉన్నారని తెలిపారు. వారంతా కాంగ్రెస్‌తోనే ఉన్నారని పేర్కొన్నారు. అదేవిధంగా క్రిస్టియన్లు కూడా తమతోనే ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో వారి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చినట్టు తెలిపారు. బీఆర్ ఎస్‌బీజేపీలు ఆడుతున్న నాటకాలను, కలిసి చేస్తున్న విన్యాసాలను ప్రజలు గమనిస్తున్నారన్న రేవంత్ రెడ్డి. త్వరలో జరగనున్న పోలింగ్‌లో ఇరు పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు.

**కిషన్ రెడ్డి మరోమాట:**
మరోవైపు బీజేపీ నాయకుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాత్రం దీనికి భిన్నంగా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కవల పిల్లలని..అవి రెండూ కలిసే పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. బీజేపీకిబీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. పైగా కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు, కేసీఆర్ మంత్రిగా పనిచేశారని తెలంగాణ వచ్చాక కుటుంబంతో సహా కలిసి వెళ్లి సోనియాగాంధీని ప్రశంసించారని గుర్తు చేశారు. కాబట్టి కాంగ్రెస్‌బీఆర్ఎస్ పార్టీల మధ్యే అవగాహనా ఒప్పందం ఉంటుందని వ్యాఖ్యానించారు.

## వచ్చే ఏడాది భారత్‌లో పర్యటిస్తా..

కాగా, భారతదేశం రష్యా చమురు కొనుగోళ్లపై అదనంగా 25 శాతం సహా 50 శాతం సుంకాలను విధించాలని వాషింగ్టన్ నిర్ణయం తీసుకున్న తరువాత, భారతదేశం, అమెరికా మధ్య కొనసాగుతున్న వాణిజ్య చర్చల మధ్య ఈ వ్యాఖ్యలు వచ్చాయి. అమెరికా అంతటా ప్రజాదరణ పొందిన బరువు తగ్గించే ఔషధాల ధరను తగ్గించే లక్ష్యంతో కొత్త ఆవిష్కరణ తీసుకువచ్చింది. ఇందులో భాగంగా ఏర్పాటైన వైట్ హౌస్ ప్రెస్ మీటింగ్ సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రకటన సమయంలో ఒక కంపెనీ ప్రతినిధి స్పృహ కోల్పోవడంతో కార్యక్రమం కొద్దిసేపు ఆగిపోయింది. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ మాట్లాడుతూ, వైట్ హౌస్ మెడికల్ యూనిట్ వెంటనే స్పందించిందని, ఆ వ్యక్తి ఇప్పుడు బాగానే ఉన్నాడని అన్నారు. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం మధ్య ఆంక్షలు, ఇంధన పరిమితుల ద్వారా రష్యాను ఆర్థికంగా ఒంటరిగా చేయడానికి ట్రంప్ చేస్తున్న విస్తృత ప్రయత్నానికి ఈ వ్యాఖ్యలు అనుగుణంగా ఉన్నాయి. నవంబర్ నెల ప్రారంభంలో, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (MEA) ట్రంప్ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా ఒక ప్రకటన విడుదల చేసింది. దేశ ఇంధన వనరుల నిర్ణయాలు జాతీయ ప్రయోజనాలు, వినియోగదారుల సంక్షేమంపై ఆధారపడి ఉన్నాయని పునరుద్ఘాటించింది.

## శిల్పాశెట్టి దంపతులకు బిగుస్తున్న ఉచ్చు

విచారణ జరుగుతోంది. ఈ నలుగురూ గతంలో బెస్ట్ డీల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో పనిచేశారు. ఆ కంపెనీ ఉద్యోగుల్లో ఒకరు ఇప్పటికే క్రైమ్ బ్రాంచ్ ముందు హాజరై తన కథను మాకు చెప్పారని ఒక అధికారి తెలిపారు. త్వరలోనే ముగ్గురు ఉద్యోగులను విచారణకు పిలిపిస్తారు. రాజ్ కుంద్రా కంపెనీని దర్యాప్తు బృందం దర్యాప్తు చేస్తోంది. కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులను విచారిస్తున్నారు. ఈ ఉద్యోగులకు రాజ్ కుంద్రా ఎంత జీతం ఇచ్చాడు. ఈ వ్యక్తులు ఏమి చేశారు? వారందరినీ విచారిస్తారు. కంపెనీకి సరిగ్గా డబ్బు ఎక్కడి నుండి వచ్చింది? ఆఫీస్ ఫర్నిచర్ కోసం రూ.20 లక్షల వరకు ఖర్చు చేసినట్లు కూడా వెల్లడవుతోంది. ఈ 20 లక్షలు ఎక్కడి నుండి వచ్చాయో దర్యాప్తు చేస్తున్నారు. శిల్పా శెట్టి, రాజ్ కుంద్రా కంపెనీ మరికొంత మందిని మోసం చేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా శిల్పా శెట్టి భర్త రాజ్ కుంద్రా కొన్ని సంవత్సరాల క్రితం జైలు జీవితం గడపవలసి వచ్చింది. ఈ సమయంలో, శిల్పా శెట్టి రాజ్ కుంద్రాకు విడాకులు ఇస్తారని కూడా ప్రచారం జరిగింది.

## కీలకంగా మారిన డేటా ఆధారిత పాలన

మార్చుకుని సమర్థంగా ఆ విభాగాన్ని వినియోగించుకుందాం. అంతా కలిసి కట్టుగా పనిచేసి ఇటీవల వచ్చిన తుఫాన్ను టెక్నాలజీ వినియోగంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని బాగా తగ్గించగలిగాం. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగాం. డేటా ఆధారిత పాలన అనేది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారిందని అన్నారు. క్వాంటం కంప్యూటర్ను వచ్చే జనవరి నుంచే అమరావతిలో ప్రారంభించబోతున్నాం. సీఎఫ్ఎంఎస్ వ్యవస్థ ద్వారా సమర్థంగా వనరుల్ని వినియోగించగలుగుతున్నాం. గత ప్రభుత్వ చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కోరుతున్నాను. నెలలవారీ, త్రైమాసిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఫలితాలను సాధించాలని సూచిస్తున్నాను. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగానే ప్రభుత్వం పౌరసేవలు అందించాల్సి ఉంది. ప్రతీ నియోజకవర్గానికీ ఓ సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేస్తాం. ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి ఆయా శాఖలకు అప్పగిస్తున్నాం. దానికి అనుగుణంగానే నిర్ణయాలు వేగంగా తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు.

## జాబ్ మేళాల ద్వారా 78వేల ఉద్యోగాలు

కల్పించేలా చూడాలని అన్నారు. గ్లోబల్ మార్కెట్లో డిమాండ్ కు అనుగుణంగా డిజిటల్, ఎఐ సాంకేతికతలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. అధునాతన సాంకేతికతలపై ప్రపంచస్థాయి సంస్థలతో భాగస్వామ్యం కోసం కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా వస్తున్న పరిశ్రమలు, వాటి అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా ఐటిఐ, పాలిటెక్నిక్ ల కరిక్యులమ్ లో మార్పులపై దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్ మెంట్ అధికారులు మాట్లాడుతూ... రాష్ట్రంలో పాలిటెక్నిక్ చదివిన వారిలో 94.6, ఐటిఐలలో 98శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తున్నాయని తెలిపారు. యువతకు బ్లూకాలర్ ఉద్యోగావకాశాల కోసం 30 ఇండస్ట్రీ ఎలైడ్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. 12 మోడల్ కెరీర్ సెంటర్ల ద్వారా 1,22,575 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విదేశీ ఉద్యోగావకాశాలను పెంచేందుకు రాష్ట్రంలో జర్మన్, ఇటాలియన్, జపనీస్, కొరియన్ భాషల్లో శిక్షణ కోసం ఇఫ్లూతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. ఓంక్యాప్ ద్వారా 1300మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 5 క్లస్టర్ల పరిధిలోని 16 సెక్టార్లలో 273 పారిశ్రామిక సంస్థలతో ఐటిఐ, పాలిటెక్నిక్ లను అనుసంధానం చేసినట్లు చెప్పారు. ల్యాబ్ స్పాన్సర్ షిప్ కోసం 17పరిశ్రమలు ముందుకు వచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 16 ఇండస్ట్రియల్ క్లస్టర్ల పరిధిలో 16 పెద్ద సంస్థలను గుర్తించి పాలిటెక్నిక్, ఐటిఐలతో అనుసంధానించాలని అన్నారు. రాష్ట్రస్థాయి న్యాక్ సెంటర్ ను మంగళగిరిలో ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ పై ఐటిఐలలో 30, పాలిటెక్నిక్ కళాశాలలో 23 యాడ్ ఆన్ కోర్సులను ప్రవేశపెట్టామని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఐటిఐ, పాలిటెక్నిక్ లకు విద్యార్థులకు సంబంధించి 95శాతం అపార్ ఐడి అథెంటికేషన్ పూర్తయినట్లు చెప్పారు. యువతకు అత్యంత ఉపయుక్తంగా తీర్చిదిద్దిన నైపుణ్యం పోర్టల్ ను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండి గణేష్ కుమార్, ఓంక్యాప్ అడ్వైజర్ సీతా శర్మ, సీడ్యాప్ సిఈఓ నారాయణ స్వామి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

❍ **నలుగురు మహిళల పరిస్థితి విషమం**

**జయభేరి, నెల్లూరు:**

నెల్లూరు జిల్లా ఉలవపాడు బైపాస్ దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను కారు ఢీకొన్న ఘటనలో 13 మంది మహిళలు, కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురు మహిళల పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు ఆస్పత్రికి తరలించారు. నెల్లూరు జిల్లాలో లోకేష్ పర్యటన కోసం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసమైంది.

# గ్యాస్ ఛాంబర్ లా మారిన ఢిల్లీ

**దేశ రాజధాని దిల్లీలో రోజు రోజుకు గాలి కాలుష్యం తీవ్రతరమవుతుంది. వాయుకాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దిల్లీకి సాయం చేసేందుకు చైనా ముందుకు వచ్చింది. గత కొన్ని రోజులుగా దిల్లీ, దాని పరిసర ప్రాంతాలలో గాలి నాణ్యత తీవ్రంగా పతనమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం ప్రతినిధి యు జింగ్ ఎక్స్ వేదికగా స్పందించారు.**



"చైనా కూడా ఒకప్పుడు తీవ్రమైన వాయు కాలుష్యంతో ఇబ్బంది పడింది. కాలుష్యాన్ని నివారించిన మా ప్రయాణాన్ని భారత్ తో పంచుకోవడానికి మేము సిద్ధంగా ఉన్నాము. భారత్ త్వరలో వాయు కాలుష్యం నివారించే స్థాయికి చేరుకుంటుందని నమ్ముతున్నాము" అని యు జింగ్ పోస్ట్ పెట్టారు. గాలి నాణ్యతను వృద్ధి చేసేందుకు చైనా కూడా పోరాడుతుందని, కాలుష్యాన్ని నియంత్రించడంలో తన అనుభవాన్ని పంచుకోవడానికి బీజింగ్ సిద్ధంగా ఉందని తెలిపారు. చైనా నియంత్రణ చర్యలు. 'ఒకప్పుడు పొగమంచుతో ఇబ్బంది పడిన చైనా, గాలి నాణ్యతను గణనీయంగా పెంచుకునే క్రమంలో విజయాలు సాధించింది. చైనా రాజధాని బీజింగ్‌తో పాటు పలు నగరాలు, పారిశ్రామిక కేంద్రాల్లో కాలుష్యం తీవ్రంగా ఉండేది. చైనా ప్రభుత్వం వెంటనే మేల్కొని నియంత్రణ చర్యలు తీసుకోవడంతో వాయు కాలుష్యం తగ్గింది. చైనా గాలి నాణ్యత ప్రమాణాలను నిర్దేశించి కచ్చితత్వంగా అమలు చేస్తుంది. వాయు కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉన్న దిల్లీలో దాన్ని కంట్రోల్ చేసేందుకు మంగళవారం కృత్రిమ వర్షం కురిపించే ప్రయత్నం చేశారు. కానీ అది విఫలమైంది.క్లౌడ్ సీడింగ్‌కు ఉపయోగిస్తున్న సెస్నా (సెస్నా కంపెనీ తయారు చేసే ఒకరకం విమానం) ఎయిర్‌క్రాఫ్ట్‌లతో మొదట ఐఐటీ కాన్పూర్ ఎయిర్ స్ట్రిప్ నుంచి, తరువాత మేరఠ్ విమానాశ్రయం నుంచి దిల్లీలో క్లౌడ్ సీడింగ్ నిర్వహించారు.ఈ విమానాలు ఖేక్రా, బురారి, నార్త్ కరోల్ బాగ్, మయూర్ విహార్, సడక్‌పూర్, భోజ్‌పూర్, ఇతర ప్రాంతాలలో క్లౌడ్ సీడింగ్ కోసం హైగ్రోస్కోపిక్ ఉప్పు (గాలిలోని తేమను ఆకర్షించే ఉప్పు. మేఘాల్లోని నీటి బిందువులను ఆకర్షించి, వాటిని పెద్ద బిందువులుగా మార్చి వర్షం కురిసేలా సహాయపడతాయి.) ను వదిలారు.దిల్లీ పర్యావరణ శాఖా మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా ఈ ప్రయత్నాలను ధృవీకరించారు. వివిధ తేమ పరిస్థితులలో వర్షం పడే అవకాశాన్ని అంచనా వేసేందుకు ఈ ప్రయోగాలు నిర్వహించామని పేర్కొన్నారు. ప్రయోగాలు జరిగిన రోజు వాతావరణంలో తేమ వర్షానికి అవసరమైన దానికంటే చాలా తక్కువగా ఉందని ఆయన అన్నారు." ఇది నగరంలో గాలి నాణ్యతను మెరుగుపరచడానికి శాస్త్రీయమైన ప్రయత్నం" అని సిర్సా అన్నారు.వాతావరణంలో తగినంత తేమ లేకపోవడమే ఈ ప్రయోగాలు విఫలమవడానికి కారణమని చెబుతున్నారు. క్లౌడ్ సీడింగ్ చేసిన ప్రాంతాల్లో గాలిలోని కాలుష్య కణాల (పార్టిక్యులేట్ మ్యాటర్) స్థాయిలో తగ్గుదల కనిపించిందని కూడా దిల్లీ ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.కానీ, అక్టోబర్ 28 నాటి సీపీసీబీ (కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు) రియల్‌టైమ్ డాటా ప్రకారం, గణనీయమైన తగ్గుదల కనిపించలేదని తేలింది."వర్షం పడటాన్ని సక్సెస్‌కు ప్రమాణంగా తీసుకుంటే, దిల్లీలో క్లౌడ్ సీడింగ్ ద్వారా కృత్రిమ వర్షాన్ని కురిపించే ప్రయత్నం విఫలమైంది" అని ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ మణీంద్ర అగర్వాల్ అన్నారు. దిల్లీలో మేఘాలలో తేమ చాలా తక్కువగా ఉందని, అందుకే క్లౌడ్ సీడింగ్ ఫలితాలు ఆశించినంతగా లేవని అన్నారు."మేం త్వరలో మళ్లీ ప్రయత్నిస్తాం. బుధవారం కూడా క్లౌడ్ సీడింగ్ చేయాలని ప్లాన్ చేశాం, కానీ మేఘాల్లో మంగళవారంకంటే తక్కువ తేమ ఉంది. రాబోయే రోజులో తగినంత తేమ కనిపిస్తే, తప్పకుండా ఈ ప్రయోగాన్ని మళ్లీ చేస్తాం" అని ఆయన అన్నారు.ఇది కృత్రిమంగా వర్షం కురిపించేందుకు భారత్‌లో దేశీయ సాంకేతికతను ఉపయోగించి చేసిన మొదటి ప్రయోగంగా చెబుతున్నారు.'దీనికి ముందు కరువు నియంత్రణ కోసం క్లౌడ్ సీడింగ్ జరిగింది. కానీ అప్పుడు ఒక ప్రైవేట్ కంపెనీ కాంట్రాక్టు తీసుకుంది. ఆ పరికరాలను విదేశాల నుంచి సేకరించారు. కాబట్టి క్లౌడ్ సీడింగ్‌లో దేశీయ టెక్నాలజీ సాయంతో చేసిన మొదటి ప్రయత్నం ఇదేనని చెప్పొచ్చు" అని ప్రొఫెసర్ మణీంద్ర అగర్వాల్ అన్నారు.వర్షాభావ పరిస్థితులను, కరువును ఎదుర్కోవడానికి, శాస్త్రీయ పద్ధతిలో క్లౌడ్ సీడింగ్ ద్వారా కృత్రిమ వర్షం కురిపించే ప్రయత్నం చేస్తారు.సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్, ఉప్పు వంటి పదార్థాల సూక్ష్మ కణాలను వాతావరణంలోకి విడుదల చేస్తారు."శాస్త్రీయ దృష్టిలో చూస్తే ఇది ఒక సులభమైన ప్రక్రియ. సన్నటి ఉప్పు మిశ్రమాన్ని మేఘాల్లోకి స్ప్రే చేస్తాం. మేఘాల్లో తగినంత తేమ ఉంటే నీటి ఆవిరి చల్లబడి, నీటి బిందువులుగా మారే ప్రక్రియ జరుగుతుంది. అది ఎక్కువగా జరిగితే వర్షం పడుతుంది. దీన్నే క్లౌడ్ సీడింగ్ అంటారు" అని ప్రొఫెసర్ మణీంద్ర అగర్వాల్ వివరించారు.ఐఐటీ కాన్పూర్‌లో ఏడెనిమిదేళ్లుగా క్లౌడ్ సీడింగ్‌పై పరిశోధన జరుగుతోందని, ఈ బృందంలో పదిమంది వరకు పని చేస్తున్నారని మణీంద్ర అగర్వాల్ తెలిపారు. దిల్లీలో క్లౌడ్ సీడింగ్‌కు ఆ రాష్ట్ర ప్రభుత్వమే నిధులు సమకూర్చిందని ప్రొఫెసర్ అగర్వాల్ ధృవీకరించారు.చైనా ఈ రంగంలో ప్రపంచంలో ముందంజలో ఉంది. అక్కడ ఇప్పుడు క్లౌడ్ సీడింగ్ కోసం ఏఐ సాంకేతికతను కూడా వినియోగిస్తున్నారు. అక్కడ లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో ఈ ప్రక్రియ జరుగుతోంది.2025 నాటికి 55 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఈ కార్యక్రమం పరిధిలోకి తీసుకురావాలన్న లక్ష్యాన్ని చైనా నిర్ణయించుకుంది. అయితే, అది పూర్తిగా సాధ్యపడలేదు.యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఎడారి ప్రాంతాలలో కూడా క్లౌడ్ సీడింగ్ ద్వారా కృత్రిమ వర్షం కురిపిస్తున్నారు. భూమి బంజరుగా మారకుండా కాపాడటానికి సౌదీ అరేబియా ఇటీవల క్లౌడ్ సీడింగ్‌ను ప్రారంభించింది. అమెరికాలోని కరువు పీడిత రాష్ట్రాల్లో వ్యవసాయ ప్రయోజనాల కోసం క్లౌడ్ సీడింగ్ పెద్ద ఎత్తున జరుగుతోంది.కొన్నిసార్లు, కార్చిచ్చులను నియంత్రించడానికి క్లౌడ్ సీడింగ్ ద్వారా వర్షాలు కురిపిస్తున్నారు. ఇజ్రాయెల్ కూడా క్లౌడ్ సీడింగ్ ద్వారా వర్షం కురిపించడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేసింది. 1960ల నుంచి ఈ టెక్నాలజీ మీద పనిచేయడం ప్రారంభించినప్పటికీ, దేశంలో మొట్టమొదటి ప్రధాన క్లౌడ్ సీడింగ్ కార్యక్రమం 2014 సంవత్సరంలో ప్రారంభమైంది .ఈ ప్రయోగాన్ని ఏడేళ్లపాటు అంటే 2021 వరకు నిర్వహించిన ఇజ్రాయెల్, సరైన ఫలితాలు రాకపోవడంతో ఆ ఏడాదే దాన్ని నిలిపివేసింది.ఈ ప్రయోగాల సమయంలో విమానాల నుంచి మాత్రమే కాకుండా గ్రౌండ్ స్టేషన్ల నుంచి కూడా రసాయనాలను గాలిలోకి విడుదల చేసింది ఆ దేశం. కానీ, దీనివల్ల వర్షపాతంలో పెద్దగా మార్పు రాలేదని పరిశోధనలో తేలింది. దీనికి పెడుతున్న ఖర్చుకు, వస్తున్న ప్రయోజనాలకు పొంతన లేదని గుర్తించిన ఇజ్రాయెల్ ఈ ప్రయోగాలను నిలిపేసింది.

## గగన్ యాన్ కు రెడీ అవుతున్న భారత్

వంటి రంగాల్లో మనం ఎంత పురోగతి సాధించామో ఈప్రయోగం ద్వారా భారత్ ప్రపంచానికి చాటనుంది. ఇప్పటివరకు ఈ స్థాయికి చేరుకున్న దేశాలు కేవలం అమెరికా, రష్యా, చైనా మాత్రమే. గగనయాన్ ద్వారా భారత్ ఆ జాబితాలో చేరడం, శాస్త్రసాంకేతిక రంగంలో మైలురాయిగా నిలుస్తుంది.భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రస్తుతం తన చరిత్రలోనే అత్యంత విస్తృతమైన ప్రణాళికను అమలు చేస్తోంది. 2026 మార్చి నాటికి ఏడు కీలక మిషన్‌లను పూర్తి చేయడం, అలాగే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా పెట్టుకున్న ఐదేళ్లలో 50 రాకెట్ లాంచ్‌లు అనే విజన్ సాధించడం ఈ వ్యూహం యొక్క ప్రధాన భాగం. ఈ ప్రణాళికలో కేవలం రాకెట్ ప్రయోగాల సంఖ్య పెరగడం మాత్రమే కాదు మానవ అంతరిక్ష ప్రయాణం, భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం,దీర్ఘకాల మిషన్‌లు వంటి కొత్త దిశల్లోనూ ఇస్రో పయనించనుంది. చంద్రయాన్ సక్సెస్ చేసి.. మంగళయాన్‌ను విజయవంతం చేసిన భారత్.. తన గగనయాన్ ప్రాజెక్టు తర్వాత మరో భారీ టార్గెట్ పెట్టుకుంది. గగనయాన్ ప్రాజెక్ట్‌ను విస్తరించి,భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం కూడా ఇందులో భాగంగా చేర్చారు. దీని కోసం ప్రభుత్వం మొత్తం బడ్జెట్‌ను ₹20,193 కోట్లకు (సుమారు $2.4 బిలియన్) పెంచింది. ఈ బడ్జెట్ కేవలం గగనయాన్ మానవ యాత్రలకే కాదు 2028 వరకు సాగే దీర్ఘకాల మిషన్‌లు, స్పేస్ స్టేషన్ మాడ్యూల్ డిజైన్, లాంగ్‌డ్యూరేషన్ లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌లు అభివృద్ధికి కూడా వినియోగిస్తారు. ఈ విస్తృత ప్రోగ్రామ్‌లో 600కి పైగా భారతీయ వెండర్లు, పరిశ్రమలు, టెక్ స్టార్టప్‌లు పాల్గొంటున్నాయి. ఇది స్వదేశీ పరిశ్రమలకు అంతరిక్ష రంగంలో పెద్ద అవకాశాలను తెరుస్తోంది. స్పేస్ హాబిటేషన్, రోబోటిక్ అసిస్టెన్స్, ఆటోమేటెడ్ కంట్రోల్ వంటి సాంకేతిక రంగాల్లో భారత్ తన నైపుణ్యాన్ని ప్రపంచానికి చూపించబోతోంది.

**భారత స్పేస్ స్టేషన్ – 2035 నాటికి లక్ష్యం**
భారత స్పేస్ స్టేషన్ నిర్మాణానికి పునాది వేస్తోంది. ఈ ప్రాజెక్ట్ 2035 నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుత బడ్జెట్‌లోని భాగం ప్రారంభ పరిశోధన, హ్యాబిటాట్ మాడ్యూల్ డిజైన్, ఆక్సిజన్ మరియు వాటర్ రీసైక్లింగ్ సిస్టమ్‌లు, స్పేస్ పవర్ జనరేషన్ టెక్నాలజీలు వంటి విభాగాలకు కేటాయించారు. భారత స్పేస్ స్టేషన్ ద్వారా భూమి చుట్టూ స్వతంత్రంగా మానవ యాత్రలు, ప్రయోగాలు, పరిశోధనల సామర్థ్యాన్ని సాధించబోతోంది. ఇది అమెరికా రష్యా, చైనా తర్వాత స్వతంత్ర స్పేస్ స్టేషన్ కలిగిన అరుదైన దేశాల జాబితాలో భారత్‌ను నిలబెట్టనుంది.

## అనుమతులేంటి...

ప్రజా కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. తెలంగాణలో ప్రజా హక్కుల కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని, ప్రజల మద్దతుతో పార్టీ మరింత బలపడుతుందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ వివాదంపై పోలీసులు స్పందించారు. తమను ఎవరూ అనుమతి అడగలేదని అది రిటర్నింగ్ అధికారి పరిధిలోకి అంశమన్నారు. కానీ బండి సంజయ్ ఈ వాదనను ఖండించారు. తాము అనుమతి అడిగామని.. అాలగే పోలీసులు తిరస్కరించారని ఆధారాలను విడుదల చేశారుకాంగ్రెస్ నేతలు మజ్లిస్ భయంతోనే ప్రచారానికి అనుమతి నిరాకరించారని బీజేపీ నేతలు అంటున్నారు. తమ సత్తా ఏమిటో చూపిస్తామని.. అందరూ బోరబండకు రావాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. స్వయంగా కేంద్ర సహాయ మంత్రి హోదాలో ఉన్న ఆయన ఇలా పోలీసులు అనుమతి నిరాకరించినా.. సభకు పిలుపునివ్వడం సంచలనంగా మారుతోంది.

## 120 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఆకస్మిక సోదాలు




**జయభేరి, విజయవాడ, నవంబర్ 6 :**
ఆంధ్రప్రదేశ్‌లో రిజిస్ట్రార్ వ్యవస్థలో పేరుకుపోయిన అవినీతిపై ఏసీబీ యుద్ధం ప్రకటించింది. ACB అధికారులు రాష్ట్రవ్యాప్తంగా 120 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఆకస్మిక సోదాలు చేపట్టారు. ఎన్టీఆర్, కోనసీమ, ఏలూరు, ప్రకాశం, విశాఖపట్నం, నెల్లూరు, శ్రీ సత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో ఏకకాలంలో ఈ తనిఖీలు జరిగాయి. రిజిస్ట్రేషన్ పత్రాలు, రికార్డులను పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై వచ్చిన అనేక ఫిర్యాదులు, అవినీతి ఆరోపణల కారణంగా ఈ సోదాలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద ఫైళ్లను స్వాధీనం చేసుకుంటున్నారు. భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మోసాలు, అక్రమ లావాదేవీలు, డాక్యుమెంట్ ఫోర్జరీలు వంటి ఫిర్యాదులు గత కొన్ని నెలలుగా పెరిగాయి.
ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ACB అధికారులు రాష్ట్రవ్యాప్తంగా 120 కార్యాలయాలపై సోదాలు చేపట్టారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఫైళ్లు, ఆర్థిక రికార్డులు, కంప్యూటర్ సిస్టమ్‌లను పరిశీలిస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, కొన్ని చోట్ల అధికారులు, సిబ్బంది నగదు, డాక్యుమెంట్లు దాచిపెట్టే ప్రయత్నాలు చేశారు. ఒంగోలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ACB టీమ్ సోదాలు నిర్వహించింది. అధికారులు రావడంతో కొంతమంది సిబ్బంది భయపడి, జేబుల్లో దాచిన నగదును బయటకు విసిరేసినట్లు సమాచారం. మధురవాడ, భోగాపురాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఆకస్మిక తనిఖీలు జరిగాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ACB టీమ్‌లు డాక్యుమెంట్లు, కంప్యూటర్ డేటాను స్కాన్ చేస్తున్నారు.
ఈ ప్రాంతంలో భూమి మోసాలు ఎక్కువగా నమోదవుతున్నాయి, కాబట్టి తనిఖీలు లోతుగా చేస్తున్నారు. సత్యసాయి జిల్లా చిలుమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై సోదాలు జరిగాయి. ఇటీవల సబ్ రిజిస్ట్రార్‌పై పలు ఫిర్యాదులు పెద్ద ఎత్తున వచ్చాయి. కార్యాలయ తలుపులు మూసివేసి, సిబ్బందిని విచారించి, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ACB డీఎస్పీ బీవీ రావు నేతృత్వంలో సోదాలు జరిగాయి. కోనసీమ, ఏలూరు, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లో కూడా సోదాలు జరుగుతున్నాయి. మొత్తం 120 చోట్ల ఏసీబీ టీమ్‌లు రంగంలోకి దిగాయి. ప్రజలు భూమి రిజిస్ట్రేషన్ సంబంధిత ఫిర్యాదులను ACBకు చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.
తనిఖీలు పూర్తయిన తర్వాత ఏసీబీ అధికారులు వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. రిజిస్ట్రార్ల అవినీతి వల్లే పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని.. భూముల వివాదాలు పెరిగిపోతున్నాయన్న ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. చాలా చోట్ల వ్యవహారాలను మొత్తం ప్రైవేటు వ్యక్తులే చక్క బెడుతున్నారు. ఇలాంటి వ్యవహారాలన్నింటికీ చెక్ పెట్టడానికి ప్రభుత్వం సంస్కరణలు తీసుకువచ్చే అవకాశాలు ఉన్నాయి.

# తాళాలు పగలగొట్టి ఫర్నిచర్ ధ్వంసం

- యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో దొంగలు
- విధుల నుంచి వాచ్ మెన్ ను సస్పెండ్ చేసిన యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ లింగస్వామి

**జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 06:**




యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో దొంగలు పడ్డారు. మున్సిపల్ కమిషనర్ లింగస్వామి,యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రధాన రహదారి బస్టాండ్ పక్కనే ఉన్న మున్సిపల్ కార్యాలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు కార్యాలయంలోకి చొరబడ్డారు. మున్సిపల్ కమిషనర్ గదితో పాటు సిబ్బందికి సంబంధించిన సుమారు 13 గదుల తాళాలు పగులట్టారు. గదుల్లోని రికార్డులు భద్రపరిచిన బీరువాలను తెరిచి సోదాలు చేసి ఫర్నీచర్ ను ధ్వంసం చేశారు. బుధవారం రాత్రి విధుల్లో ఉన్న వాచ్ మెన్ సరిగ్గా విధులు నిర్వహించకపోవడమే దొంగతనం జరిగినట్టు తెలుస్తుంది. గురువారం తెల్లవారుజామున విధులను హాజరయ్యేందుకు మున్సిపల్ సిబ్బంది రావడంతో ఘటన చూసి వెంటనే మున్సిపల్ కమిషనర్ సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. జరిగిన సంఘటనపై మున్సిపల్ కమిషనర్ లింగస్వామి పోలీసులకు సమాచారం అందజేసినట్లు తెలిపారు. వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్ పరిశీలించిన అనంతరం దొంగతనం ఘటనపై మున్సిపల్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీమ్ ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించి పలు ఆధారాలు సేకరించింది. మున్సిపల్ కమిషనర్ లింగస్వామి ఫిర్యాదు మేరకు ఘటనపై పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని యాదగిరిగుట్ట పట్టణ సీఐ బాస్కర్ తెలిపారు. దొంగతనంపైన పలు ఆధారాలు సేకరించినట్లు నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.



**విధుల నుంచి వాచ్ మెన్ ను సస్పెండ్ చేసిన మున్సిపల్ కమీషనర్ లింగస్వామి**

యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో రాత్రి సమయంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది వాచ్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి బుధవారం రాత్రి కార్తీక పౌర్ణమి సందర్భంగా ఇంటికి భోజనానికి వెళ్లి అర్ధరాత్రి తిరిగి వచ్చినట్లు తెలిపారు. విధుల పట్ల వాచ్ మెన్ ను నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే దొంగతనం జరిగిందని, అతని విధుల నుంచి సస్పెండ్ చేసిన యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ లింగస్వామి తెలిపారు.



## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని ఏర్పరుచుకోవాలి

**జయభేరి, గార్ల, నవంబర్ 6:**

విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే శాస్త్రీయ దృక్పథాన్ని ఏర్పరచుకొని ప్రతిభను కనబరచాలని జన విజ్ఞాన వేదిక గార్ల మండల అధ్యక్షులు మాచర్ల సుందర్ కుమార్ కోరారు.చెకుముకి టాలెంట్ టెస్ట్ ను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జెవివి ఆధ్వర్యంలో గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,విద్యార్థుల్లో శాస్త్ర దృక్పథాన్ని పెంపొందించేందుకు చెకుముకి టాలెంట్ టెస్ట్ పరీక్షలు ఎంతో దోహద పడతాయని తెలిపారు.విద్యార్థులు పాఠశాల స్థాయిలో పోటీపరీక్షల్లో పాల్గొంటే భవిష్యత్తులో పోటీపరీక్షలపై భయం ఉండదని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.విద్యార్థులలో పరిశీలన, వివేచన, విచక్షణ, హేతుబద్ధ ఆలోచనలు, పరిశోధన శక్తి పెంపొందించుటకు ఉపాధ్యాయులు కృత్యాధార ప్రయోగాత్మక బోధనకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. నవంబర్ 7న పాఠశాల స్థాయి,21న మండల స్థాయి,28న జిల్లాస్థాయి, డిసెంబర్ 12 నుండి 14 వరకు రాష్ట్రస్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ పరీక్షల విజయవంతం కై ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు మాలోత్ శివ నాయక్,ఉపాధ్యాయులు పి.పద్మ,ఫయాజ్, సురేందర్ రెడ్డి, పి ఎన్ స్వామి, జి. వీరన్న, కన్నయ్య, కవిత, వీరస్వామి,శ్రీను, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చి న్యాయం చేయాలి

- సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్




**జయభేరి, చింతపల్లి :**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చింతపల్లి మండలం కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం సభ్యులతో శాంతియుతంగా భారీ ర్యాలీ నిర్వహించారు స్థానిక అంబేద్కర్ విగ్రహం నుండి ఎస్బిఐ బ్యాంక్ బిర్లా పెయింట్ షాప్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సామాజిక వేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే జనాభా ప్రాతిపదికన 42% రిజర్వేషన్లను రాజకీయ, విద్యా , ఉద్యోగ రంగాల్లో రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్ లో చేర్చి శాశ్వత పరిష్కారం చూపాలని, ఇది ఒక సామాజిక ఉద్యమంగా మారి గ్రామ గ్రామాన మన బీసీలు ఇప్పుడైనా చైతన్యం కాకపోతే మరొక అవకాశం రాదు అని, రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ ఉద్యమించి రిజర్వేషన్ల సాధన కోసం ఐక్యమై పోరాడి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చొల్లేటి భాస్కరాచారి, వరికుప్పల ఆర్మీ శ్రీను, ఏనుగుల వెంకటేష్, రెడ్డి కోటేశ్వరరావు, యాచారం వెంకటయ్య గౌడ్, బోయపల్లి పర్వతాలు గౌడ్, బాడిగె యాదయ్య గౌడ్, పులికరం సైదులు తదితరులు పాల్గొన్నారు.



## అవార్డు పొందడం నా పూర్వజన్మ సుకృతం

- మహిళా శక్తిని ముందుకు తీసుకు వెళుతున్న లావుడి బాషా కు గౌరవ డాక్టరేట్ అవార్డు

**జయభేరి, దేవరకొండ :**

25 సంవత్సరముల నుండి స్వచ్ఛంద సేవా సంస్థను నిర్వహించి మహిళా శక్తిని ముందుకు తీసుకు వెళ్తున్న గిరిజన ముద్దు బిడ్డ లావుడి బాషా చౌహన్ కు బుధవారం ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్, రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ వారు గౌరవ డాక్టరేట్ అవార్డుతో బహుకరించారు. ఈ సందర్భంగా ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఏకుల రమేష్ చేతుల మీదుగా అవార్డు అహ్వాన పత్రాన్ని అందుకున్నారు. గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్న బాషా నాయక్ మాట్లాడుతూ సమాజ హితం కోసం పరితపిస్తూ,తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పాటు చేసుకొని,బావిలోని కప్పలాగ జీవితం కడపోదంటూ, నలుగురి కోసం నాలుగు రోజులైనా గడపాలన్నదే తన లక్ష్యమని అన్నారు. ఈ అవార్డుతో తన బాధ్యత ఇంకా పెరిగిందని,ముందు ముందు ఉన్నత సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు.వెనుకబడిన దేవరకొండ గిరిజన ప్రాంతంలో మహిళ లోకం కొరకు ఉచిత కొట్టు శిక్షణ కంప్యూటర్ బ్యూటిషన్ నర్సింగ్ కోర్సులతో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం తన పూర్వజన్మ స్కృతంగా భావిస్తున్నానని , ఉచిత శిక్షణ కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉండాలి

- పేరబోయిన మహేందర్

**జయభేరి, యాదగిరిగుట్ట:**




యాదగిరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్ని సమస్యలను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ డిమాండ్ చేశారు. గురువారం అఖిల భారత యువజన సమైఖ్య జిల్లా కమిటీ పిలుపు మేరకు యాదగిరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ధర్నా నిర్వహించి యాదగిరిగుట్ట మండల వైద్యాధికారి డాక్టర్.పావనికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ.. యాదగిరిగుట్టలో దాదాపు 20 వేల జనాభాతో పాటు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనానికి ఎంతో మంది భక్తులు వస్తుంటారని, స్థానికులు,భక్తుల కనుగుణంగా ఆస్పత్రిలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కనీసం అటెండర్ లేకపోవడం బాధాకరమని,వెంటనే అటెండర్ నియమించాలని, ప్రభుత్వ ఆస్పత్రిని వెంటనే 100 పడకలకు మార్చాలని డిమాండ్ చేశారు. స్టాఫ్ నర్సులు నలుగురికి బదులు ముగ్గురే ఉన్నారని, మరొకరిని నియమించాలన్నారు. ప్రాథమిక ఆస్పత్రిలో రేబిస్ వ్యాక్సిన్ లేకపోవడంతో భువనగిరికి వెళ్లాల్సి వస్తుందని,వెంటనే రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉండాలని కోరారు. యాదగిరిగుట్ట మండలంలోని అన్ని సబ్ సెంటర్లకు పక్కా బిల్డింగ్ తో పాటు ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని, అన్ని రకాల దయాగ్నస్టిక్ సేవలు అందుబాటులో ఉండాలన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఉన్న వైద్యులు,ఇతర సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్,ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, నేతలు అనంతుల నర్సింహా,గుండు వెంకటేష్ గౌడ్, గొపగోని రాజు, పేరబోయిన మహేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లు గీత కార్మిక కుటుంబాలకు పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**జయభేరి, యాదగిరిగుట్ట:**




తెలంగాణ రాష్ట్రంలోని ప్రమాదవశాత్తు చెట్లపై నుండి పడి మరణించిన, వికలాంగులైన కల్లు గీత కార్మిక కుటుంబాలకు ఇవ్వాల్సిన రూ.13 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కల్లు గీత పనివారుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కళ్లెం కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కల్లుగీత పనివారుల సంఘం యాదగిరిగుట్ట మండల కౌన్సిల్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి యాదగిరిగుట్ట డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణకు వినతివత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళ్లెం కృష్ణ మాట్లాడుతూ..కల్లు గీత వృత్తిలో చనిపోయిన కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, తాత్కాలిక గాయాలైన వారికి రూ.2 లక్షలకు పెంచాలన్నారు. మెడికల్ బోర్డు విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ సివిల్స్ అసిస్టెంట్ సర్జన్ పర్యవేక్షణలో తాత్కాలిక,శాశ్వత వికలాంగుల నిర్ధారణ సర్టిఫికెట్ పద్ధతి పునరుద్ధరించాలని, తెలంగాణ రాష్ట్రంలో అన్ని టిఎఫ్ టి సహకార సంఘాలలో చెట్టు గీసే కల్లు గీత కార్మికులందరికీ సంపూర్ణ సేఫ్టీ కిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. కల్లు గీత వృత్తి అభివృద్ధి సంక్షేమం కోసం సంఘం ప్రతినిధులతో ప్రభుత్వం సమన్వయ సమావేశాలు నిర్వహించాలని,కల్లు గీత సహకార సంఘాలు టీఎఫ్టీలకు శాశ్వత లైసెన్సులు, అర్హులైనవారందరికీ గుర్తింపు కార్డులు,సభ్యులకు ఉచితంగా వృత్తి పరికరాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లు గీత పనివారుల సంఘం మండలాధ్యక్షుడు గుండు వెంకటేష్ గౌడ్,నేతలు బండి జంగమ్మ, కల్లేపల్లి మహేందర్, బబ్బూరి శ్రీధర్, పేరబోయిన పెంటయ్య, దూశెట్టి హరిశంకర్, గుండ్లపల్లి లింగం, స్వామి, పచ్చిమట్ల నరేష్, అనంతుల నర్సింహ, గోపగాని రాజు పాల్గొనారు.

## స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు NVT కరాటే క్లాస్ లను ప్రారంభించినారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనమునందు ప్రతిరోజు ఉదయం 6 గంటలకు క్లాసులు నిర్వహించబడునని ఆసక్తి గలవారు రావచ్చని పేర్లు నమోదు చేసుకోగలరని తెలియజేసినారు. వారు మాట్లాడుతూ కరాటే వల్ల లాభాలుకరాటే వలన శారీరక, మానసిక ప్రయోజనాలు ఉన్నాయి. ఇది శారీరక సామర్థ్యాన్ని, బలం, చురుకుదనం, వేగం, సమన్వయం, వశ్యతను పెంచుతుందని, మానసికంగా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, ఆత్మనియంత్రణ, సమస్యలను ఎదుర్కొనే శక్తి వంటి లక్షణాలను పెంపొందిస్తుంది. ముఖ్యంగా, ఇది ఆత్మరక్షణకు చాలా ఉపయోగపడుతుంది. కరాటే అనేది ఆత్మరక్షణ కోసం ఒక ముఖ్యమైన నైపుణ్యం, ముఖ్యంగా మహిళలకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. వయస్సుతో సంబంధం లేకుండా ఇది సమతుల్యతను మెరుగుపరుస్తుందని అన్నారు. మాస్టర్ p గోపి నాయక్, సీనియర్ కరాటే మాస్టర్ 18 సంవత్సరాల అనుభవం , సెల్ఫ్ డిఫెన్స్, కరాటే, జూడో, బాక్సింగ్, వెపన్స్ నేర్పబడును. సెల్ఫ్ డిఫెన్స్, ఫిట్నెస్, డిసిప్లిన్, సేఫ్టీ, రెస్పెక్ట్, లాయాల్టీ, కోఆర్డినేషన్ హానర్ కాన్ఫిడెన్స్ నేర్చుకోవాలనుకున్నవారు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనము నందు సంప్రదించగలరు.

## వర్షంతో పత్తి తడిసి రైతుకు నష్టం



**జయభేరి, డిండి :**

డిండి మండలం శాంతి గూడెం గ్రామంలో అధిక వర్షాలు పడడం వల్ల పత్తి ఎకరం కు 15 క్వింటాల్ వస్తదనుకున్నది 5 క్వింటాల్ కూడా రావడం లేదు పెట్టుబడి ఎకరాకు 80 వేల వరకు అయింది ఇప్పుడు పత్తి తీయాలంటే కింటాకు 20 రూపాయలు అడుగుతారు రైతన్నలు గోసపడుతురు దయచేసి ప్రభుత్వం ఏమన్నా సహాయం చేయగలరని శాంతి గూడెం గ్రామం ప్రజలందరూ కోరుకుంటున్నారు.

## మళ్లీ తుపాకీ పట్టిన ఐపిఎస్ ఆఫీసర్ వీసీ సజ్జనార్

**జయభేరి, హైదరాబాద్ :**



ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా పేరొందిన ఐపిఎస్ ఆఫీసర్ వీసీ సజ్జనార్ మళ్లీ తుపాకీ పట్టారు. ఇవాళ ఉదయం హైదరాబాద్ శివార్లలోని తెలంగాణ పోలీసు అకాడమీకి సీపీ సజ్ నార్ వెళ్లారు. హైదరాబాద్ సిటీ పోలీసు బృందంతో కలిసి ఆయన పిస్టల్‌తో షూటింగ్ ప్రాక్టీస్ చేశారు. షూటింగ్ రేంజ్‌కు వెళ్లడం, లక్ష్యం గురి తప్పకుండా కొట్టడం ఎప్పుడూ గొప్ప అనుభూతిని ఇస్తుందని, బుల్స్ ఐకి గురిపెట్టి కొట్టడం థ్రిల్లింగ్‌గా కూడా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సీపీ సజ్జనార్ స్వయంగా తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. వీసీ సజ్జనార్ హైదరాబాద్ సీపీ ఈ ఏడాది అక్టోబర్ 30వ తేదీన బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. అంతకుముందు దాదాపు నాలుగేండ్లు టీజీఎస్ ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించే కంటే ముందు సజ్జనార్ సైబరాబాద్ సీపీగా విధులు నిర్వర్తించారు.

## టీడీపీ నేత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి లోకేష్

**జయభేరి, నెల్లూరు:**

ఇటీవల మృతి చెందిన నెల్లూరుకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబాన్ని మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంతకు ముందు నెల్లూరు జిల్లా కావలి చేరుకున్న లోకేశ్‌కు ఎమ్మెల్యే వెంకటకృష్ణ రెడ్డి, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముసునూరు టోల్ ప్లాజా నుంచి దగదర్తి వరకు ర్యాలీగా వెళ్లారు.



## ఇందిరమ్మ ఇల్లు బిల్లును మంజూరు చేయాలని ఎంపీడీవోకు వినతి

**జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 06 :**

ఇందిరమ్మ ఇల్లు బిల్లును మంజూరు చేయాలని తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామానికి చెందిన కుకుట్ల మల్లేశం గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంధమల్ల గ్రామంలో ఇల్లు నిర్మించుకునే క్రమంలో బేస్మెంట్ పూర్తి అయిన తర్వాత ఫోటో తీసిన తర్వాత డబ్బులు నా అకౌంట్లో జమ కాలేదని, అందుకు అధికారులు డబ్బులు నా అకౌంట్లో అయ్యేంత వరకు ఇంటి నిర్మాణ పనులను ఆపవలసిందిగా తెలియజేసినారు. కానీ మెటీరియల్ మిగిలి ఉన్నందున సిమెంట్ గడ్డ కడుతుందని ఆత్రుతతో సజ్జల వరకు గోడలు నిర్మించుకున్నారని ఇట్టి క్రమంలో డబ్బులు ఎకౌంట్లో జమ కాలేదన్న ఆవేదనతో మనోవేదనకు గురై మద్యం సేవించి తొందరపాటుతో తాగిన మత్తులో స్థానిక తాసిల్దారు కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేసుకున్నానని అందుకు తప్పిదంగా భావించి తనను క్షమించి ఇందిరమ్మ ఇల్లు బిల్లును మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ నరేష్, పంచాయతీ కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థి



**జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 06 :**

సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 69వ స్కూల్ గేమ్స్ లో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టును ఎన్నుకోవడం జరిగింది. కబడి అండర్ 17లోపు బాలికల జట్టును ఎంపిక చేశారు. ఈ జట్టులో తుర్కపల్లి మండలం మోడల్ స్కూల్ విద్యార్థిని ఆకుల పూజ సిఇసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం పట్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి, అధ్యాపక బృందం అభినందనలు తెలియజేశారు. ఎంపికైన విద్యార్థిని ఈనెల 8 నుండి 10వ తేదీ వరకు జడ్పీహెచ్ఎస్ ఈదుల బయ్యారం, కొత్తగూడెం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పాఠశాల పిడి పల్లె రమేష్ రెడ్డి తెలిపారు.

## మహిపాల్ కుటుంబాన్ని పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి



**జయభేరి, పరకాల, నవంబర్ 06:**

పరకాల మండలం పోచారం గ్రామంలో ఇటీవలే పిడుగుపాటుతో మృతిచెందిన కూస(గోనె) మహిపాల్ కుటుంబాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం పరామర్శించారు.ఈ సందర్భంగా మహిపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సంఘటన వివరాలు కుటుంబసభ్యులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. పిడుగు పాటుతో మృతిచెందిన మహిపాల్ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా వచ్చే తక్షణ సహాయాన్ని వెంటనే అందేలా చూడాలన్నారు. మృతుడి కుటుంబానికి అన్నివిధాల ఆదుకుంటామని చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చల్లా వెంట పరామర్శించిన వారిలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

## అంతిమయాత్రలో పాల్గొన్న సోదా రామకృష్ణ



**జయభేరి, పరకాల, నవంబర్ 06:**

పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డుకు చెందిన (న్యూస్ 10 రిపోర్టర్) ప్రముఖ ఫోటోగ్రాఫర్ గా సుదీర్ఘకాలం పనిచేసినటువంటి సూదమల్ల శ్రీనివాస్ ఏడాది కాలం నుండి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఎంజిఎంలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గురువారం వారి పార్థివ దేహానికి పూలమాలతో నివాళులు అర్పించి, వారి అంతిమయాత్రలు పాల్గొన్న సోదా రామకృష్ణ. రామకృష్ణ తో పాటుగా సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ నల్లెల్ల అనిల్ కుమార్, ఏకు రాజు, నాయకులు కాంగ్రెస్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు

- పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- అంగరంగ వైభవంగా నాగారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం .. ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి



**జయభేరి, పరకాల, నవంబర్ 06:**

గురువారం పరకాల మండలం నాగారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ గారితో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో పాల్గొని, రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు.అంతకుముందు డప్పు చప్పుళ్ళు, కోలాటాలు, బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్వీట్ తినిపించి, శాలువాతో సన్మానించి, కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలోని నాగారం గ్రామంలో ప్రథమంగా ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని, ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో శిలాఫలకాలికే పరిమితమయ్యారని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వ పాలకులు స్కీం లు, స్కామ్ లతో వెలకోట్లు సంపాదించారని ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు, సీఎంఆర్ఎఫ్ కళ్యాణ లక్ష్మి, తదితర సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందజేస్తున్నామని తెలిపారు.



# విద్య పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది

- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్



**జయభేరి, షాద్ నగర్, నవంబర్ 06 :**

విద్యాపట్ల ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుంది. విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం ప్రభుత్వానికి ఏమాత్రం సరికాదు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ పోరాడుతుంది. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో షాద్ నగర్ ముఖ్యకూడలిలో ఆందోళన కార్యక్రమం. షాద్ నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో విద్యార్థులు ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా తీవ్ర ఆందోళనకు దిగారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు, స్కాలర్షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ మాట్లాడుతూ;ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది అని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు 10,500 కోట్ల రూపాయలకు చేరుకున్నా, ప్రభుత్వం మాత్రం మౌనంగా ఉంది. ఇది విద్యార్థుల భవిష్యత్తుపై పరోక్ష దాడి అని తీవ్రంగా విమర్శించారు. గత మూడు రోజులుగా అనేక డిగ్రీ కళాశాలలు మూతపడినా ప్రభుత్వం స్పందించలేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్న ప్రభుత్వం, విద్యార్థుల సమస్యల పట్ల మాత్రం అసమర్థత ప్రదర్శిస్తోందని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబించడం, రాష్ట్ర యువతను నిరాశలోకి నెట్టే దిశగా ఉంది. వెంటనే విద్యా వ్యవస్థను పునరుద్ధరించేందుకు చర్యలు ప్రారంభించాలి! లేకపోతే రానున్న రోజుల్లో విద్యార్థి సమాజం తగిన గుణపాఠం చెబుతుంది అని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నరేష్ రాథోడ్, అనిల్ నాయక్, పవన్ నాయక్, మనోజ్, గణేష్, మాణిక్యం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమంలో ప్రభుత్వం విఫలం

- విద్యను గాలికి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం
- విద్యార్థులకు అందని ఫీజు బకాయిలు
- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు వడ్ల శ్రీకాంత్




**జయభేరి, షాద్ నగర్, నవంబర్ 06 :**

విద్యార్థుల సంక్షేమంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో షాద్ నగర్ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ; పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ 8500 కోట్లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు గత ఆరు సంవత్సరాల నుండి స్కాలర్షిప్ ఫీజ్ రియంబర్స్మెంట్ విడుదల చేయలేకపోవడం సిగ్గుచేటు అని గత నాలుగు రోజులుగా ప్రైవేటు డిగ్రీ కాలేజీలు మరియు ఇంజనీరింగ్ కాలేజీలు స్వచ్ఛందంగా బంధు చేసుకొని ఉన్న కనీసం ప్రభుత్వం వారితో చర్చలు జరుపకపోవడం బాధాకరం అని అన్నారు.

విద్య పట్ల అన్ని అబద్ధాల హామీలు బూటకపు మాటలు చెబుతూ విద్యార్థుల విద్య పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వానికి విద్యార్థులు బుద్ధి చెప్పే సమయం త్వరలోనే ఉందని అన్నారు. విద్యార్థులకు మెరుగైన వస్తువులు కల్పించడంలో పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విద్యలు అన్ని అవకతవకలు జరుగుతున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి కాలేజీ యజమాన్యాలతో చర్చలు జరిపాలని లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదిల్, సాయి, బన్నీ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి కలశ శోభాయాత్ర, సహస్రదీపయజ్ఞం

- 108 కుండముల గాయత్రి జ్ఞాన మహా యజ్ఞం



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి పట్టణంలో శుక్ర, శనివారాలలో నిర్వహించేటటువంటి గాయత్రి కళాశాల శోభాయాత్ర, గాయత్రి సహస్ర దీప యజ్ఞం, 108 కుండముల గాయత్రీ జ్ఞాన మహా యజ్ఞం కార్యక్రమాలను విజయవంతం చేయాలని గాయత్రీ పరివార్ కొండమల్లేపల్లి నిర్వాహకులు వింజమూరు చంద్రమౌళి అన్నారు. గురువారం కొండమల్లేపల్లి లోని గాయత్రి పరివార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అఖిల విశ్వ గాయత్రీ పరివార్ శాంతి కుంజ్ హరిద్వార్ కొండమల్లేపల్లి శాఖ ఆధ్వర్యంలోనిర్వహించేటటువంటి ఈ బృహత్తర కార్యక్రమంలో కొండమల్లేపల్లి పట్టణంతో పాటు పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహా యజ్ఞంతో వాతావరణం పవిత్రమవుతుందని లోకానికి మంచి జరుగుతుందని అన్నారు.ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడిచేందుకు ఇటువంటి దైవ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు చౌరస్తాలో గల శ్రీ సీతారామచంద్ర మౌళీశ్వర స్వామి దేవస్థానం నుండి సాగర్ రోడ్డులోని మార్కెట్ యార్డ్ వరకు కలశ యాత్ర ఉంటుందన్నారు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శనివారం మార్కెట్ యార్డులో 108 కుండముల యజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు. వేదమూర్తి తపోనిష్ట పరమ పూజ పండిత శ్రీరామ శర్మ ఆచార్య 1926 లో సంవత్సరంలో వెలిగించిన అఖండ జ్యోతి ఇప్పటికి నిరంతరం వెలుగుతుందని ప్రస్తుతం 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, మరియు మాత భగవతీదేవి వంద సంవత్సరాల జన్మదిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.కార్యక్రమంలో శుక్రవారం రాత్రి అల్పాహారం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం మాలాధారణ భక్తులకు, మరియు సాధారణ భక్తులకు అల్పాహారం, యజ్ఞం అనంతరం మధ్యాహ్నం భోజనం కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో దాచేపల్లి వెంకటేశ్వర్లు, వింజమూరి సత్యనారాయణ, నూతన గంటి జగన్, విక్రమ్,రాఘవ, శ్రీశైలం, ఏరుకొండ రాము, మారం వెంకన్న, గాజుల కుషాల్,అజిత, యాద ధనుంజయ, వరలక్ష్మి నాగార్జున రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.



## వేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**జయభేరి, రాజన్న సిరిసిల్ల:**

తంగళ్ళపల్లి మండల పరిధిలో మొత్తం 11 ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. తంగళ్ళపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో హౌసింగ్ శాఖ నిర్మించిన మోడల్ హౌస్, మండేపల్లి, చింతలపల్లి, రాళ్లపేటలో మొత్తం 11 ఇందిరమ్మ ఇండ్లు పూర్తి కాగా గృహ ప్రవేశాలు గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, కే కే మహేందర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నదని, దీనిలో భాగంగా లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నదని తెలిపారు. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మిగతా లబ్దిదారులు అందరూ ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని, త్వరితగతిన తమ సొంత ఇంటి కలను పూర్తి చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అధికారులు అందుబాటులో ఉండి నిర్మాణాలు పూర్తి చేసుకునేలా సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింగ్, హౌసింగ్ పీడీ శంకర్, మండల ప్రత్యేక అధికారి, డీపీఓ శర్ఫుద్దిన్, తహసిల్దార్ జయంత్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద కాపర్తిలో ఆర్డీవో విచారణ

**జయభేరి, నల్గొండ:**

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం, పెద్ద కాపర్తి శివారులో.. ప్రభుత్వ భూమి నుంచి ప్రైవేట్ వ్యక్తులకు దారి తీసుకోవడంపై ఆర్డీవో అశోక్ రెడ్డి విచారణ చేపట్టారు. సర్వే నెంబర్ 201 లో తిరుమల నాథస్వామి గుట్ట భూమిలో. ప్రైవేట్ వ్యక్తులు 40 ఫీట్ల వెడల్పుతో బాట వేయడంపై గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కి ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామస్తుల ఫిర్యాదుతో ఆర్డీవో అశోక్ రెడ్డి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సర్వే నెంబర్ 201 ని పూర్తిగా సర్వే చేసి.. హద్దులు నాటిన తర్వాత దారి కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు ఆర్డీఓ అశోక్ రెడ్డి హామీనిచ్చారు.

## వైకాపా నేత గౌతం రెడ్డి కారుపై పెట్రోల్ దాడి

**జయభేరి, విజయవాడ:**

వైసీపీ నేత గౌతమ్ రెడ్డి కారుపై గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 12వ తేదీన విజయవాడలోని గౌతమ్ రెడ్డి ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉన్న కారుపై ఈ దాడి జరిగింది. సీసీటీవీ ఫుటేజ్ లో నిందితుడు కనిపించినప్పటికీ, అతడిని గుర్తించలేకపోతున్నామని పోలీసులు తెలిపారు. గౌతమ్ రెడ్డి తనకు ప్రాణహాని ఉందని, ప్రభుత్వం రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కుల పత్రాలు అందే వరకు పోరాడుతాం

- కులపత్రాలు జారీచేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలి
- మాదాసి, మాదారి కురువ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సింధం విఠలయ్య
- కుల పత్రాలు జారీ చేయాలంటూ తహసిల్దార్లకు వినతి పత్రం అందజేత

**జయభేరి, షాద్ నగర్, నవంబర్ 06 :**



మాదాసి కురువ, మాదారి కురువలకు ఎస్సీ కుల పత్రాలను వెంటనే జారీ చేయాలని షాద్ నగర్ తాలూకా సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ కుల పత్రాలను వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండల తాసిల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు సమర్పించినట్లు ఆ సంఘం అధ్యక్షులు సింధం విట్టలయ్య మీడియా తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సింధం విఠలయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు బండ వెంకటేష్‌లు తహసిల్దార్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాదాసి మాదారి కురువ సంఘం నాయకులు మాట్లాడుతూ; న్యాయబద్ధమైన తమ హక్కుల కోసం పోరాడుతున్న మా కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు వెంటనే అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు.

తమది ఏ వెనుకబడిన కులాలకు సంబంధంలేని కులమని, ఎస్సీలలో అంతర్లీనమై ఉందని ఇప్పటికే నిర్ణయించారని గుర్తు చేశారు. రాజ్యాంగం గుర్తించిన కులాలలో మాదాసి కురువ, మాదారి కురువ కులాలు ఎస్సీ జాబితాలో ఉన్నాయని గతంలో రెవిన్యూ అధికారులు తప్పుడు పేర్లతో తమను బీసీలలో విలీనం చేసి తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమది సంచార జీవనం, వివిధ ప్రాంతాలలో సంచరిస్తూ కష్టపడి జీవిస్తుంటాం! అందుకే రెవెన్యూ అధికారుల ద్వారా జరిగిన ఈ అన్యాయాన్ని తాము గుర్తించలేకపోయామని వారు పేర్కొన్నారు. తమ కుల పెద్దలు జరిగిన వాస్తవాన్ని గుర్తించి తమకు న్యాయం జరగాలని పోరాటం మొదలు పెట్టారని, అయినప్పటికీ ఇప్పటిదాకా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను గత ప్రభుత్వాలన్నింటికీ విన్నవించినప్పటికీ ఇలాంటి ఫలితం రాలేదని, చివరికి ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లగా వారు గుర్తించి తమను వెంటనే ఎస్సీ జాబితాలో చేర్చాలని సిఫార్సు చేశారని అన్నారు. దీనిపై స్పందించి గత ప్రభుత్వాలు తమను ఎస్సీగా గుర్తిస్తున్నట్టు ప్రకటించాలని, కోర్టు ప్రకటన కూడా తమకు అనుకూలంగానే వచ్చిందని అన్నారు. అయితే ఇప్పటిదాకా కుల పత్రాలు మాత్రం జారీ చేయకపోవడంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని అన్నారు. ఇటీవల కురువ కులస్తులకు ధృవపత్రాలు జారీ చేసి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, అధికారులు మాత్రం ఇంకా అందుకు అనుగుణంగా పనిచేయడం లేదని అన్నారు. ప్రభుత్వం వీటన్నిటిని పరిగణలోకి తీసుకొని ఇకనైనా తమ కుల ధ్రువపత్రాలను జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఫరూక్ నగర్ మండల కార్యాలయంలో ఎమ్మార్వో నాగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదాసి మాదారి సంఘం నాయకులు బండల బాలరాజు, బండ కుమార్, కోరే రాజు, గొరిగే అర్జున్, సాంబ, రంగయ్య, శివకుమార్, పి.యాదయ్య, ఈశ్వరయ్య, రాజ్ కుమార్, రాజేష్ తదితరులు ప్రముఖులు పాల్గొన్నారు.



# చిన్నారి మృతి ఇంటి ఓనర్ పై అనుమానం

**జయభేరి, కోనసీమ, నవంబర్ 6:**

అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో పదేళ్ల చిన్నారి సిర్రా రంజిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈమె మరణం స్థానికంగా సంచలనం రేపింది. మంగళవారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన చిన్నారి రంజిత ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగత జీవిగా కనిపించింది. రామచంద్రపురంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో అయిదో తరగతి చదువుతున్న చిన్నారి రంజిత స్కూల్ టీచర్లు ఒత్తిడి కారణంగానే ఆత్మ హత్యకు పాల్పడిందని అంతా భావించారు. అయితే తల్లి తన కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని ఆరోపించడంతో ఆ దిశగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తన కుమార్తె మృతిలో వారు అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని కుమారుడు జాకీర్ హుస్సేన్ పాత్రపై అనుమానం వ్యక్తం చేసిన క్రమంలోనే పోలీసులు అతన్నిఅదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ కుమార్ మీనా తెలిపారు. రామచంద్రపురం ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్‌నర్స్‌గా పని చేస్తున్న సిర్రా సునీత ఉద్యోగ రీత్యా రామచంద్రపురంలో టి.నగర్ కమల్ కాంప్లెక్స్‌లో అద్దెకు ఉంటోంది. భర్త ముంబైలో ఉంటుండగా వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె వేరే ప్రాంతంలో చదువుకుంటుండగా మృతి చెందిన బాలిక రంజిత స్థానిక ఓ ప్రైవేటు స్కూల్‌లో 5వ తరగతి చదువుతుంది.. మంగళవారం కాకినాడ వెళ్లిన తల్లి సునీతకు స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన చిన్నకుమార్తె రంజిత ఫోన్ చేసి స్కూల్ నుంచి ఇంటికి వచ్చేసినట్లు తెలిపింది. అయితే సుమారు 7 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన సునీతకు ఇంటి గది తలుపు లోపల గడియ పెట్టి ఉండడంతో తలుపు తీయమని ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో కంగారుపడింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చారు. అదే సమయంలో ఇంటి యజమాని కుమారుడు జాకీర్ కూడా వచ్చి కిటికీ తలుపులు తీసి దానినుంచి తలుపు గడియ తీశాడు. అప్పటికే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరికి వేళాడుతూ విగత జీవిగా కనిపించింది చిన్నారి రంజిత. ఉరి నుంచి దింపి చిన్నారిని హుటాహుటీన ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి రంజిత మృతిచెందినట్లు వైద్యులు దృవీకరించారు.. రామచంద్రపురంలో పదేళ్ల చిన్నారి రంజిత అనుమానస్పద మృతి తీవ్ర కలకలం రేపింది. తల్లి సునీత ఫిర్యాదు మేరకు డీఎస్పీ రఘువీర్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. స్కూల్ నుంచి వచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే మృతిచెందడంతో తొలుత స్కూల్ యాజమాన్యాన్ని, టీచర్లను విచారించారు పోలీసులు. అయితే చిన్నారి రంజిత మెరిట్ స్టూడెంట్ అని, చాలా యాక్టివ్‌గా ఉంటుందని, తను ఆత్మహత్యచేసుకునేందుకు ఎటువంటి కారణం లేదని తేలడంతో రంజితను స్కూల్ నుంచి ఇంటికి తీసుకువచ్చే ఆటోడ్రైవర్‌ను విచారించారు. అయితే బుధవారం ఉదయం చిన్నారి తల్లి వ్యక్తం చేసిన ఇంకో అనుమానాన్ని ఆధారంగా చేసుకుని ఇంటి యజమాని కుమారుడు జాకీర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు డీఎస్పీ రఘువీర్ తెలిపారు. లోపల గడిచ పెట్టి ఉండడంతో ఇంటి యజమాని కుమారుడు జకీర్ వచ్చి కిటికీలోనుంచి చాలా సునాయాసంగా ఇంటి గడియ తీశాడని చెప్పింది. గతంలో అతనిపై రెండు హత్యా నేరాలున్నాయని తేలడంతో ఆదిశగా దర్యాప్తును ముమ్మరం చేశారు పోలీసులు. క్లూస్ టీమ్ ద్వారా ఇంటి వద్ద ఆధారాలను సేకరించామని డీఎస్పీ రఘువీర్ తెలిపారు. ఇంక్వెస్టు రిపోర్టు ఆధారంగా కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. బాలిక తల్లి సునీత ఇంటి ఓనర్ కుమారుడు జకీర్‌పై అనుమానం వ్యక్తంచేయడంపై పోలీసులు జకీర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. జకీర్ 2004లో ఓ మహిళ హత్య కేసులో నిందితుడు. ఇంకో హత్య కేసులో కూడా నిందితుడు.. రెండు హత్య కేసుల్లో నిందితుడైన జకీర్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని తల్లి ఆరోపిస్తుంది.. అనుమానస్పదంగా మృతిచెందిన చిన్నారి రంజిత మెరిట్ స్టూడెంట్ అని, చాలా చలాకీగా ఉంటుందని తెలిసిందని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఎవ్వరూ ఎటువంటి అపోహలకు పోవద్దని తెలిపారు. మైనర్ అనుమానాస్పద మృతి విషయంలో ఇంకా దర్యాప్తులో కేసు ఉందని, ఎన్డీఏ కూటమిలో పోలీసులను ప్రభావితం చేసేవారు ఉండరని, తప్పు చేసిన వాడు రోడ్డు మీద తిరిగే అవకాశం ఇవ్వదని అన్నారు. బాలిక తల్లి సునీతను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# జూబ్లీహిల్స్‌లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి విస్తృత ప్రచారం

- మాగంటి గెలుపే లక్ష్యం
- సోమాజిగూడ డివిజన్ లో 9 బూత్ లకు ఇంచార్జ్ గా ప్రచారంలో దూసుకుపోతున్న ఎమ్మెల్సీ
- కేటీఆర్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్న నేత

**జయభేరి, షాద్ నగర్, నవంబర్ 06 :**



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోరులో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత గెలుపు కోసం పార్టీ అగ్ర నాయకత్వం, శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఈ ప్రచారంలో భాగంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తనదైన మార్కుతో దూసుకుపోతున్నారు. ఆయనకు కేటాయించిన సెగ్మెంట్లలో ముమ్మర ప్రచారం చేపడుతూ కార్యకర్తలతో కలిసి మాగంటి విజయానికి పదునైన వ్యూహాలను అమలు చేస్తున్నారు. సోమాజిగూడ కేటీఆర్ రోడ్ షోల వెనుక నవీన్ రెడ్డి కృషి. బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నదాని ప్రకారం, ఈ ఎన్నికలో పార్టీ స్టార్ క్యాంపెయినర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షోలను తనకు కేటాయించిన సోమాజిగూడ సెగ్మెంట్ లో విజయవంతం చేయడంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కృషి. కేటీఆర్ పర్యటనలకు సంబంధించిన ఏర్పాట్లు, జన సమీకరణ, కార్నర్ మీటింగ్‌ను సక్సెస్ చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా పార్టీ లోని సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యే లతో కలిసి ఎన్నికల్లో అమలుపరిచే వ్యూహాల పై ఎప్పటికప్పుడు చర్చిస్తూ కింది స్థాయి నాయకులకు దిశా నిర్దేశం చేస్తూ వారితో కలిసి పార్టీ గెలుపు కోసం శ్రమిస్తున్నారు.

**అధికార పార్టీ హామీలను ఎండగడుతూ ప్రచారం...**

నవీన్ రెడ్డి తన ప్రచారంలో కేవలం బీఆర్ఎస్ విజయానికి కృషి చేయడమే కాకుండా, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా విమర్శిస్తున్నారు. అధికార పార్టీ మోసాలను ప్రజలకు వివరిస్తూ, హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ, రైతు భరోసా, 500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అమలు చేయడంలో విఫలమైందని ఆయన ఆరోపిస్తూ గులాబీ గెలుపు కోసం ఆయన విస్తృత ప్రచారం చేస్తున్నారు.

# కాలనీ ల అభివృద్ధి కి అన్ని విధాలా కృషి చేస్తా..

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాలనీ ల అభివృద్ధి కి అన్ని విధాలా కృషి చేస్తాను అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం కాప్రా డివిజన్ పరిధిలోని శిరిడి నగర్ లో 80 లక్ష రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన CC Road నిర్మాణానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ లకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, కాలనీ ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్, సుకుమారి, పూర్ణచందర్ రావు, వైకుంఠం, బ్రహ్మ చారి, రతి మురుగన్, ప్రభావతి, కిశోరె, ప్రసాద్ BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# డ్రగ్, గన్ కల్చర్‌కు కేటీఆరే కారణం

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 6:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పెరిగిన డ్రగ్, గన్ కల్చర్‌కు కేటీఆరే మూలమంటూ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేస్తున్న 'బాకీ కార్డు' ప్రచారాన్ని తిప్పికొడుతూ, బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలు, రాష్ట్రంపై పెట్టిన లక్షల కోట్ల అప్పుల సంగతేంటని నిలదీశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం తుమ్మల మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత 20 నెలలుగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. రేవంత్ రెడ్డి పాలన కారణంగా పారిశ్రామికవేత్తలు రాష్ట్రం విడిచి వెళ్లిపోతున్నారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తుమ్మల తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా అవాస్తవమని, రోజూ ఎందరో పారిశ్రామికవేత్తలు కొత్త పెట్టుబడులతో తెలంగాణకు వస్తున్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు ఇటీవలి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను గుర్తుంచుకోవాలని తుమ్మల హితవు పలికారు. "పదేళ్ల బీఆర్ఎస్ పాలనను చూసిన ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారు. అలాంటి వారికి కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదు" అని ఆయన అన్నారు.




# జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తే.. ఆందోళన బాట తప్పదు

**టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సమావేశం స్పష్టం**

**జయభేరి, హైదరాబాద్ :**

గత ప్రభుత్వం మాదిరిగానే, ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తే రాష్ట్ర వ్యాపితంగా ఆందోళన బాట తప్పదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) స్పష్టం చేసింది. గురువారం నాడు శంకర్ పల్లి మండలంలోని పొద్దటూరులో ప్రగతి రిసార్ట్స్ లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో, జర్నలిస్టుల ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారంలో ప్రభుత్వం నుండి జరుగుతున్న జాప్యంపై కార్యవర్గం సుదీర్ఘంగా చర్చించింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి దాదాపు రెండేళ్లు కావస్తున్నా, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించక పోవడం విచారకరమని సమావేశం అభిప్రాయపడింది. గత ప్రభుత్వం ఇలాంటి వైఖరినే అనుసరిస్తే గల్లీ నుండి ఢిల్లీ దాక తమ సంఘం లెక్కలేనన్ని ఉద్యమాలు చేపట్టిన విషయాన్ని సమావేశం గుర్తుచేసింది. జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇంటి స్థలాలు, ఆరోగ్య పథకం, అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను వీలైనంత తొందరలో పరిష్కరించాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ అంశంపై ఐజేయు జాతీయ అధ్యక్షులు, మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్చించినట్లు ఆయన స్పష్టం చేసారు.

ఫిబ్రవరి మాసం మొదటి వారంలో విజయవాడలో జరగనున్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయు) జాతీయ ప్లీనరీని విజయవంతం చేసేందుకు సన్నాహాలు ప్రారంభమైనట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అయితే ఈ ప్లీనరీ సందర్భంలో జనవరి మాసంలో రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాల్లో సదస్సులు నిర్వహించేందుకు సమావేశం నిర్ణయించింది. మహాసభలు పెండింగులో ఉన్న జిల్లాల్లో జనవరి మొదటి వారంలోపు వాటిని పూర్తి చేయాలని సమావేశం నిర్ణయించింది. యూనియన్ నియమించిన ఆయా సబ్ కమిటీల సమావేశాలను త్వరలో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఇటీవల జరిగిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నికల్లో ఫ్రెండ్స్ ప్యానెల్ కు మద్దతు పలికి, ప్యానెల్ గెలుపు కోసం శ్రమించిన రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీతో పాటు ఇతర నాయకులను కార్యవర్గం అభినందించింది. అలాగే ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి సమావేశం శుభాకాంక్షలు తెలిపింది. గత కార్యవర్గ సమావేశం తర్వాత యూనియన్ చేపట్టిన వివిధ కార్యక్రమాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రాంనారాయణ నివేదిక సమర్పించారు. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో అకాల మరణం చెందిన 16మంది జర్నలిస్టులకు సమావేశం నివాళి అర్పిస్తూ, సంతాప సూచికగా మౌనం పాటించింది. రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన రంగారెడ్డి జిల్లా శాఖను సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సమావేశంలో ఐజేయు జాతీయ మాజీ అధ్యక్షులు, స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎం.ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. సంపత్ కుమార్, గాడిపల్లి మధు గౌడ్, కార్యదర్శులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జి. మధు గౌడ్, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్ లతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 30 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి టైపింగ్‌లో మూడో ర్యాంక్



**జయభేరి, హైదరాబాద్ :**

ఇంటర్మీడియట్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శ్రీ భాష్యం సహస్ర, తెలంగాణ టెక్నికల్ బోర్డు ప్రతి సంవత్సరం నిర్వహించే ఇంగ్లీష్ టైపు రైటింగ్ హయ్యర్ పరీక్షలో అత్యుత్తమ నైపుణ్యంతో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించింది. ఉప్పుగూడలోని గౌతమ్ టైపు రైటింగ్ ఇనిస్టిట్యూట్ లో తర్ఫీదు పొందింది. జూలై 2025లో బోర్డు నిర్వహించిన ఈ పరీక్షలో విద్యార్థిని ఈ ప్రతిభ కనబరచడం పట్ల ఇన్ స్టిట్యూట్ ప్రిన్సిపాల్ అరుణ్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ర్యాంక్ సాధించడం తమ సంస్థకు గర్వకారణం అన్నారు. భవిష్యత్తులో ఆమె మరింత పై స్థాయికి ఎదగాలని కోరుతూ అభినందించారు.

# జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య.. ముగ్గురి అరెస్ట్

**జయభేరి, మేడ్చల్, నవంబర్ 6:**

నవంబర్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్); మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో రోషన్ కుమార్ సింగ్(22)జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ప్రధాన నిందితుడు రౌడీ షీటర్ బాలశౌర్ రెడ్డి(21)తోపాటు సహకరించిన ఇద్దరు నిందితులు సయ్యద్ మహ్మద్(28), రేవో ఆదిత్య(26)లను అరెస్టు చేశామని బాలానగర్ డిసిపి కోటి రెడ్డి తెలిపారు. దాడిలో తీవ్రంగా గాయపడి మరణించిన రోషన్ కుమార్ సింగ్(22) గతంలో పలు కేసుల్లో నిందుతుడుగా ఉన్నాడు. ఇతని పై బాలానగర్ పోలీస్ స్టేషన్ లో రౌడీ షీట్ ఉందని వివరించారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, ఒక ద్వి చక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని పోలీసులు వెల్లడించారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌జెండర్‌ను అత్యాచారం చేసి డబ్బు చెల్లించే విషయంలో ఇద్దరు రౌడీ షీటర్ల మధ్య గొడవ జరడంతో ఒకరిని కత్తితో పొడిచి హత్య చేసిన విషయం తెలిసిందే.



# ప్రభుదేవాతో రొమాన్స్ చేసిన అనసూయ..

టాలీవుడ్‌లో యాంకర్‌గా, నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అనసూయ భరద్వాజ్ ఇప్పుడు కోలీవుడ్ ఆడియన్స్‌ను ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు. 'పుష్ప 2', 'రజాకార్' వంటి సినిమాలతో ఇటీవల ప్రేక్షకులను పలకరించిన అనసూయ తాజాగా తమిళ సినిమాలో గ్లామరస్ లుక్‌లో కనువిందు చేశారు. ప్రభుదేవా హీరోగా నటిస్తున్న 'ఊల్ఫ్' సినిమాలో అనసూయ స్పెషల్ సాంగ్ చేశారు. ఈ సినిమాలో ఆమెతో పాటు లక్ష్మీరాయ్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. వినూ వెంకటేశ్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ నుంచి ఎప్పటి నుంచో ఎలాంటి అప్‌డేట్ రాకపోవడంతో సినిమా ఆగిపోయిందనే వార్తలు వచ్చాయి. అయితే, ఎవరూ ఊహించని విధంగా మేకర్స్ తాజాగా 'సాసా సాసా' అంటూ సాగే ఐటమ్ సాంగ్‌ను విడుదల చేశారు.
ఈ పాటలో అనసూయ గ్లామరస్ అవతారంలో కనిపిస్తూ ప్రభుదేవాతో రొమాంటిక్‌గా డాన్స్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'పుష్ప 2'లో మాస్ లుక్‌తో అదరగొట్టిన తర్వాత ఇప్పుడు పూర్తిగా భిన్నమైన స్టైలిష్ అవతారంలో కనిపించడంతో నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో విడుదల కానున్న ఈ 'ఊల్ఫ్' చిత్రాన్ని త్వరలోనే థియేటర్లలో రిలీజ్ చేయాలని చిత్రబృందం భావిస్తోంది. తాజాగా రిలీజ్ చేసిన ఈ సాంగ్‌తో మూవీపై మళ్లీ ఆసక్తి పెరిగింది. అనసూయ అభిమానులు ఇప్పుడు ఆమె తమిళ ఎంట్రీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రంగస్థలం చిత్రంతో వెండితెరకి పరిచయమైన అందాల ముద్దుగుమ్మ అనసూయ తన నటనతో ఎంతగానో మెప్పించింది. ఈ సినిమాలో అనసూయ నటనకి ఫిదా కాని వారు లేరు. ఈ సినిమా తర్వాత అనసూయకి చాలా అవకాశాలు వచ్చాయి. ఇటీవల తెలుగులో కాస్త అవకాశాలు తగ్గడంతో ఇప్పుడు ఈ అమ్మడు తమిళంలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది.

# సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో?



అగ్ర హీరో అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. సన్ పిక్చర్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ భారీ పానిండియా సైన్స్ ఫిక్షన్ మూవీ 2027లో విడుదల కావొచ్చని ఓ అంచనా. ఓ వైపు ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటూనే, మరోవైపు నెక్స్ట్ సినిమా కోసం కథలు వింటున్నారు అల్లు అర్జున్. ఈ క్రమంలోనే బాలీవుడ్ అగ్ర దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ కథ కూడా విన్నారట. 'పుష్ప 2' సమయంలోనే వీరిద్దరి మధ్య చర్చలు జరిగాయట. ఇన్నాళ్లు కథపై కసరత్తులు చేసిన భన్సాలీ.. కథ సంతృప్తిగా రావడంతో రీసెంట్‌గా బన్నీకి వినిపించారట. బాలీవుడ్ సమాచారం ప్రకారం బన్నీ కూడా కథ విషయంలో పాజిటివ్‌గానే స్పందించారని వినికిడి. అయితే.. ఈ సినిమా సెట్స్‌కి వెళ్లడానికి ఖచ్చితంగా రెండేళ్లకు పైనే పడుతుందని అంటున్నారు. అంత సమయం అంటే.. ఈ లోపు 'పుష్ప 3'తో సుకుమార్ కలవొచ్చు, 'సరైనోడు 2' తీసుకొని బోయపాటి వెళ్లొచ్చు. ఇక ప్రశాంత్ నీల్ ఎలాగూ ఉన్నాడు. మరి ఏమవుతుందో చూడాలి.

# గోవాలో అందాల గోల:



నటి ప్రగ్యాజైస్వాల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ బ్యూటీ సొంతం. మిర్చిలాంటి కుర్రాడు అనే సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మకు అదృష్టం కలిసి రావడం లేదనే చెప్పాలి. అందం, అభినయం ఉన్నా, రెండు బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్నప్పటికీ ఈ బ్యూటీకి అవకాశాలు మాత్రం అంతగా రావడం లేదు. వరుణ్ తేజ సరసన కంచె మూవీలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. తర్వాత చాలా సినిమాల్లో నటించింది. కానీ అవి అంతగా హిట్ అందుకోలేదు, కానీ నందమూరి నటసింహం బాలకృష్ణ సరసన అఖండ మూవీలో నటించి మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకొంది. ఇక ఈ మూవీ తర్వాత ఓం నమో వెంకటేశాయ, గుంటూరోడు, నక్షత్రం, జయజానకీ నాయక, ఆచారి అమెరికా యాత్ర, సైరా వంటి చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. ముఖ్యంగా ఈ సినిమాల తర్వాత దాకు మహారాజ్‌లో నటించి తన అందచందాలతో అందరినీ ఆకట్టుకుంది. రెండు సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్నప్పటికీ ఈ అమ్మడుకు తెలుగులో అంతగా అవకాశాలు రావడం లేదు. దీంతో ఈ బ్యూటీ ఇక సమయం దొరికిన ప్రతి సారి వెకేషన్‌కు వెళ్తూ ఎంజాయ్ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ, గోవాలో సందడి చేసింది. తన క్యూట్ నెస్‌తో అందరినీ మాయ చేస్తుంది. నడుము అందాలతో అందరి మనసు దోచేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. మరి మీరు కూడా ఈ ఫొటోస్ ఓ లుక్ వేయండి.

# నీ బరువు ఎంత ?



తమిళంలో విడుదలైన 96 సినిమా భారీ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో త్రిష టీనేజ్ పాత్రలో నటించి ఆకట్టుకుంది గౌరీ కిషన్. అదే చిత్రాన్ని తెలుగులో జాను పేరుతో రీమేక్ చేయగా.. తెలుగులోనూ అదే పాత్రలో కనిపించింది. ఆమె ప్రస్తుతం అదర్స్ చిత్రంలో నటిస్తోంది. అబిన్ హరికరణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం నవంబర్ 7న విడుదలైంది. దీంతో కొన్ని రోజులుగా ఈ మూవీ ప్రమోషన్లలో పాల్గొంది. ఈ క్రమంలో నవంబర్ 6న చెన్నైలో ప్రెస్ కాన్ఫరెన్స్ జరుగుతుండగా.. అక్కడే ఉన్న ఓ విలేకరి మాట్లాడుతూ.. 'మిమ్మల్ని ఎత్తితే ఎంత బరువు ఉంటారు ?' అని అడిగారు. దీంతో గౌరీ కిషన్ సీరియస్ అయ్యింది. 'నా బరువు తెలుసుకుని నువ్వు ఏం చేస్తావు? ఇదంతా ఎవరినైనా శారీరకంగా అవమానించడమే.. నేను ఒక సినిమాలో నటించాను. దాని గురించి అడగండి. నువ్వు అడిగినది నా ఇమేజ్ ని ఎగతాళి చేయడం లాంటిది' అంటూ ఘాటుగానే బదులిచ్చింది. దీంతో మరోసారి సదరు విలేకరి స్పందిస్తూ.. 'అప్పుడు అడిగిన ప్రశ్నే మళ్లీ అడుగుతున్నాను. నేను సాధారణంగా అడిగే ప్రశ్ననే అడిగాను, నేను తప్పుగా ఏమీ అడగలేదు. నేను నిన్ను మోడీ గురించి అడగవచ్చా? ఖుష్బు, సరిత లాంటి ప్రతి ఒక్కరూ ఈ ప్రశ్నను ఎదుర్కొన్నారు' అని అన్నారు. దీంతో మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది గౌరీ కిషన్.. నేను ఒక సినిమాలో నటించాను. అందులో నా పాత్ర గురించి అడగండి. మీరు నా బరువు గురించి అడగడం నాకు ఇష్టం లేదు. సినిమాలో నా పాత్ర గురించి అడగకుండా నా బరువు తెలుసుకోవడం అంత ముఖ్యమా ? నేను ఇక్కడ ఉన్న ఏకైక మహిళను. నా చుట్టూ చాలా మంది పురుషులు ఉన్నారు. మీరు బాడీ షేమింగ్ చేస్తున్నారు. ఒక నటి బరువు తెలుసుకోవడం అసభ్యకరం. ఇది ప్రశ్నార్థకం కాదు. మీరు మీ వృత్తికి అవమానం తెస్తున్నారు' అంటూ సీరియస్ అయ్యింది.

# అజిత్ కుమార్ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఏకే 64'



కోలీవుడ్ స్టార్ అజిత్ కుమార్ నటిస్తున్న తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఏకే 64' గురించి మరో ఆసక్తికర అప్డేట్ బయటకు వచ్చింది. ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా భారీ ప్రాజెక్ట్‌కి గణనీయమైన బడ్జెట్ కేటాయించినట్లు సమాచారం. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో అజిత్‌తో పాటు మరో ఇద్దరు స్టార్ హీరోలు కూడా కీలక పాత్రల్లో నటించబోతున్నారు. వారు విజయ్ సేతుపతి, రాఘవ లారెన్స్. అయితే ఈ ఇద్దరు విలన్లుగా నటిస్తారా? లేక అజిత్‌కు సపోర్ట్ చేసే శక్తివంతమైన పాత్రల్లో కనిపిస్తారా? అన్నది ఇంకా రహస్యంగానే ఉంచారు. సినీ వర్గాల ప్రకారం, వీరి రోల్స్ మల్టీడైమెన్షనల్‌గా ఉండనున్నాయని, కేవలం ప్రతినాయక పాత్రలుగా మాత్రమే కాకుండా కథలో ప్రధాన మలుపులకు కారణమవుతారని సమాచారం.
ఇప్పటికే 'వాలిమై', 'వీరమ్', 'తునివు', 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి సినిమాలతో భారీ విజయాలు అందుకున్న అజిత్, ఈసారి మరింత స్టైలిష్, మాస్ మరియు ఎమోషనల్ యాక్షన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా స్క్రిప్ట్ ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. జనవరిలో ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పూర్తి వివరాలను ప్రకటిస్తామని అజిత్ స్వయంగా స్పష్టంచేశారు. ఈ చిత్రానికి దేశంలోని అగ్రశ్రేణి టెక్నీషియన్లు, యాక్షన్ మాస్టర్స్, కెమెరామెన్‌లు జట్టుకట్టినట్లు తెలుస్తోంది. అజిత్ ఈ సినిమాకి తన కెరీర్‌లోనే అత్యధిక పారితోషికం తీసుకుంటున్నారని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.
ఇక రాఘవ లారెన్స్ ప్రస్తుతం 'కాంచన 4' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. పూజా హెగ్డే, నోరా ఫతేహి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా ఇప్పటికే మంచి బజ్ సొంతం చేసుకుంది. మరోవైపు విజయ్ సేతుపతి బాలీవుడ్, కోలీవుడ్, టాలీవుడ్‌లలో వరుసగా ప్రాజెక్టులు చేస్తూ దూసుకెళ్తున్నారు. 'ఏకే 64'లో అజిత్, విజయ్ సేతుపతి, రాఘవ లారెన్స్ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే ఇది కోలీవుడ్ మాత్రమే కాకుండా పాన్ ఇండియా స్థాయిలోనే అత్యంత క్రేజీ కాంబోగా నిలుస్తుందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**